క్లుప్తంగా

ఉద్యోగానికి ఎంపికైన యువతికి సన్మానం



తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పోటీపరీక్షల మెటీరియల్ చదివి జిల్లా కోర్టులో ఉద్యోగం సాధించిన తిరువూరుకు చెందిన యువతిని తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. పట్టణంలోని 16వ వార్డుకు చెందిన సోమవరపు కృష్ణ కవిత ఇటీవల హైకోర్టు నిర్వహించిన నియామక పరీక్షల్లో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలను చదివి స్వయం కృషితో ఉద్యోగం సాధించినందుకు ఆమెను తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు రాంప్రదీప్ శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

సంస్థ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, కార్మిక సంఘాలు సమన్వయంతో పనిచేయాలని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అన్నారు. నూతనంగా ఎండీ బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఇబ్రహీంపట్నం ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ–1535 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాస్‌కుమార్, కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. సంస్థ పురోభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాధాకృష్ణ, కోశాధికారి ఎస్.మధుబాబు, ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు మధుప్రకాశ్‌రెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ‘సంక్షేమ’ఫలాలు

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం కలిగిందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. పట్టణంలోని పలు వార్డులలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం జరిగింది. వార్డు కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు కౌన్సిలర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. తిరువూరు నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, పాలం రమాదేవి, మోదుగు ప్రసాద్, ఆంజనేయపురం, మల్లేల, పెద్దవరం, ఎర్రమాడు గ్రామాల సర్పంచులు మామిడి కుటుంబరావు, వంగూరి మరియమ్మ, గద్దె అప్పారావు, బొర్రా మాధవి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కలకొండ రవికుమార్, తాళ్ళూరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు కార్యక్రమం

మైలవరం: మైలవరం గ్రామ సచివాలయం–5 పరిధిలో వెంకటేశ్వర థియేటర్ వెనుక ఏరియాలో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొంటారని పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న మహాత్మా పూలే జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కాగా ఉదయం 6.30 గంటలకు కొండపల్లి ఎర్రబ్రిడ్జి సమీపంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ కార్యాలయం తెలిపింది. 10.30 గంటలకు విజయవాడ రూరల్ మండలంలోని వైఎస్సార్ కాలనీలో రంజాన్ సందర్భంగా ముస్లిం మహిళలకు చీరల పంపిణీ, ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేస్తారని పార్టీ కార్యాలయం తెలిపింది.

సమగ్రంగా భూముల రీ సర్వే



కొర్లగుంటలో ఆరంభమైన డ్రోన్ సర్వే కార్యక్రమం

ముసునూరు: రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే సమగ్రంగా, సమర్థవంతంగా కొనసాగుతోందని నూజివీడు డీఐఎస్ వరహాల రాజు, రీసర్వే డీఐఓఎస్ షేక్ హుమాయూన్ బేగ్ పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే, భూహక్కు–భూపరిరక్షణ కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన డ్రోన్ ద్వారా రీసర్వే మండల సర్వేయర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన సోమవారం కొర్లగుంటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరగనున్న సర్వే ద్వారా మండలంలోని భూముల సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ఎన్.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు వి.సుందరరావు, వైస్ ఎంపీపీలు రాజా నాయన, గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యోహాను, రాకేష్, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు. కాగా తొలిరోజు కొర్లగుంట గ్రామంలో సర్వే విజయవంతంగా పూర్తయి, తాళ్లవల్లిలో కొనసాగుతున్నట్లు సర్వేయర్ తెలిపారు.

మొక్కజొన్న రైతుకు కనీస మద్దతు ధర చెల్లించాలి



మైలవరంలో మొక్కజొన్న పరిశీలిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

మైలవరం: మొక్కజొన్న రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా నాయకులు సోమవారం మైలవరం మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్నను సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకుండా కేవలం మధ్య దళారీలు, లైసెన్స్ పొందిన వ్యాపారుల ద్వారా మొక్కజొన్న కొద్ది రోజులు క్రితం వరకు క్వింటా రూ.2,200 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు అకాల వర్షాల తరువాత క్వింటా రూ.1,950 ధరకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీ వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వీ. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 21 మంది గైర్హాజరు



నూజివీడులోని సెయింట్ మేరీస్ స్కూల్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

మైలవరం: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి గణిత శాస్త్రం (మ్యాథ్స్) పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి పీ రత్నశ్యామ్‌బాబు తెలిపారు. మండలంలో మొత్తం 1,169 మంది విద్యార్థులకు గాను 21 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే 94 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 10 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

నూజివీడులో..

నూజివీడు: డివిజన్ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు డివిజన్ పరిధిలో 52 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 3,339 మందికి గాను 3,287 మంది హాజరయ్యారు. నూజివీడు పట్టణంతో పాటు నూజివీడు మండలంలో కలిపి ఎనిమిది పరీక్ష కేంద్రాలలో 1,739 మందికి గాను 23 మంది గైర్హాజరవ్వడంతో 1,716 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆగిరిపల్లి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలలో ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు, ముసునూరు మండలంలోని 3 పరీక్ష కేంద్రాల్లో 16 మంది గైర్హాజరయ్యారు.

మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ ముఖ్యం



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, ప్రొఫెసర్ కాంతాబాబు, డాక్టర్ బుచ్చయ్య

మైలవరం: ఆధునిక ప్రపంచంలో మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ ఎంతో ముఖ్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధో సంపత్తి హక్కులు ఆవిష్కరణ, స్టార్టప్ అనే అంశంపై జాతీయ సదస్సును ఆర్థికశాస్త్రం, వాణిజ్య విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ చాలా ముఖ్యమని, దీని ద్వారా పోటీ శక్తులను, ఉత్పత్తులను పెంపొందించి దేశ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎం. కాంతాబాబు మాట్లాడుతూ మేధోసంపత్తి హక్కులు ఆవిష్కరణలు, స్టార్టప్ విస్తృతంగా చేసినట్లైతే భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. సదస్సులో డాక్టర్ ఎం.బుచ్చయ్య మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఉన్న కొండపల్లి బొమ్మలు, చిత్తూరు టమాటా, కర్నూలు ఉల్లి పాయలు, కోస్తా చేపలకు, పేటెంట్ హక్కులను కల్పించాలన్నారు.

క్రికెట్ పోటీల్లో ఎల్‌బీఆర్‌సీఈ విద్యార్థుల ప్రతిభ



క్రికెట్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

మైలవరం: జేఎన్‌టీయూసీకే సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల్లో సోమవారం జరిగిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి మాట్లాడుతూ మార్చి 25 నుంచి ఏప్రిల్ 9 వరకు జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు ఏలూరులోని వేలూపూర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగాయన్నారు. ఈ పోటీలలో వివిధ కళాశాలల నుంచి 64 టీములు పాల్గొన్నాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో కానూరు పీవీపీ ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై ఎల్‌బీఆర్‌సీఈ జట్టు విజయం సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ బేబీరాణి, బి.నాగరాజును కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. హరినాథ్‌రెడ్డి అభినందించారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. విజయవాడ సత్యనారాయణపురంపోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడుకు చెందిన ఫిర్యాది తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో 2021 ఆగస్టు 8వ తేదీ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోనికి ప్రవేశించి బీరువాలోని నగదు, వెండి వస్తువులను దొంగతనం చేశారన్నారు. దీనిపై ఇచ్చిన ఫిర్యాదుతో సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసి సీసీఎస్ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో సీసీఎస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా అనుమానితులపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 2022 ఆగస్టు 29న పటమట పోలీసులు మరో దొంగతనం కేసులో నిందితుడైన ఒడిసా రాష్ట్రం ఛత్రాపూర్, గంజాం జిల్లాకు చెందిన దున్నా మనోజ్‌రావు(38)ను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అదే నెలలో 30న సత్యనారాయణపురం పోలీసులు నిందితుడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి విచారించి అతని వద్ద నుంచి 48 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తొలుత పేర్కొన్న కేసులో నిందితుడైన దున్నా మనోజ్‌రావును 3వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా విచారణలో భాగంగా 13 మంది సాక్ష్యులను ప్రాసిక్యూషన్ తరుపున హాజరు పరిచారు. విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున సోమవారం 3వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి నిందితుడైన మనోజ్‌రావుకు 11 నెలల సాధారణ జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమావతి, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, సత్యనారాయణపురం క్రైమ్ ఎస్ఐ ఎండీ షరీఫ్, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో విచారించారు.

కోళ్ల వ్యర్థాల వాహనాన్ని అడ్డుకున్న యువకులు

చాట్రాయి: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని చనుబండలో గ్రామస్తులు సోమవారం ఉదయం అడ్డుకున్నారు. రోడ్డుపై తరలిస్తున్న వ్యర్థాలతో తీవ్రమైన దుర్గంధం రావడంతో చాలామంది తట్టుకోలేక వాంతులు చేసుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన యువకులు వాహనాన్ని అడ్డుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వడంతో వాహనంలో ఉన్న వ్యర్థాలను పొక్లెయిన్‌తో గొయ్యి తీసి పూడ్చివేశారు. రోజూ వరంగల్ నుంచి ఏలూరు పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు సమాచారం.



కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం

నేడు ఎమ్మెల్యే కార్యక్రమాలు

తిరువూరు: నియోజకవర్గంలో మంగళవారం జరిగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పార్టీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8 గంటలకు నియోజకవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు పూలే విగ్రహాల ఆవిష్కరణ

విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో గ్రామ సచివాలయం పక్కన బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే విగ్రహాలను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆవిష్కరిస్తారని ఐక్యవేదిక నాయకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ మెర్సీవనజాక్షి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

నూజివీడు: పురపాలక సంఘాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఈ నెల 30వ తేదీలోగా చెల్లిస్తే ఐదు శాతం పన్ను రాయితీ లభించనుంది. ఈ ఏడాది చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఏకమొత్తం ఒకేసారి ముందస్తుగా చెల్లిస్తేనే ఈ పన్ను రాయితీ వర్తిస్తుంది. ఇలా ఐదు శాతం పన్ను రాయితీ ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నూజివీడు పురపాలక సంఘం ఆస్తి పన్ను డిమాండ్ దాదాపు రూ.5 కోట్లుగా ఉంది. పట్టణ పరిధిలో దాదాపు 12 వేలకు పైగా ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. దీనిలో ఐదు శాతం అంటే రూ.25 లక్షల వరకు ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. గత ఏడాది బకాయిలు ఉంటే వాటిని కూడా ఇప్పుడు చెల్లిస్తేనే రాయితీ వర్తిస్తుంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెలఖారులోగా చెల్లించిన వారికే ఈ పన్ను రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్ కుమార్, ఆలయ ఈఓ వై సీతారామయ్య పర్యవేక్షించారు. కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మారెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నదానం

తిరునాళ్ల ముగింపు సందర్భంగా మారెమ్మ దేవస్థానం ప్రాంగణంలో గ్రామస్తులు, భక్తుల సహకారంతో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, గ్రామ ప్రముఖుడు రేగళ్ల ప్రతాపరెడ్డి, ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ సీ కాలనీ ఆడిటోరియంలో యోగా శిక్షణ తరగతులు ఈ నెల 12 నుంచి 21వ తేదీవరకు నిర్వహించనున్నట్లు యోగా గురువు లంకే జనార్దన్ సోమవారం తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యాన పద్ధతులపై శిక్షణ ఇవ్వ నున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు 6301454859లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించండి



గంపలగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ రంగారావు పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై తొమ్మిది అర్జీలు అందాయి. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు టౌన్ డీఈఓలేటి దుర్గారావు, డీఎల్‌పీఓ పీ వెంకటరత్నం, ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు పాల్గొన్నారు.

స్పందనలో ఆరు దరఖాస్తులు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, వ్యవసాయ ధికారి బి.సాయిశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముని లక్ష్మి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతు సమస్యలపై కమిషనర్‌కు విన్నపం



ఉద్యానశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గంపలగూడెం: మైలవరం, ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, రెడ్డిగూడెం మండలాల్లో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉద్యానవనశాఖ కమిషనర్ శ్రీధర్‌ను విజయవాడలో ఆయన కార్యాలయంలో కలిసి దరఖాస్తు ఇచ్చినట్లు రైతు సంఘం గంపలగూడెం మండల అధ్యక్షుడు సీహెచ్ వీరారెడ్డి తెలిపారు. ఆయా మండలాల్లో తామర, గులాబీ పురుగు ఆశించడంతో పాటు ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మామిడి పంట నష్టంవాటిలి రైతాంగం తీవ్ర నష్టపోయిన విషయమై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు కేశవరావు ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలసి వినతి పత్రం అందజేశామన్నారు. నష్టపోయిన మామిడి రైతులకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని, మామిడి పంటకు వాతావరణ బీమా వర్తింపజేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. రైతు సంఘం మండల నాయకులు చెరుకు వీరారెడ్డి, మామిడి రైతు మీసాల సత్యనారాయణ, ఆంజనేయులు వినతి పత్రం అందజేసినవారిలో ఉన్నారు.

గర్భిణులకు భోజనాల ఏర్పాటు



గర్భిణులకు భోజనం పెడుతున్న వైద్య సిబ్బంది

రెడ్డిగూడెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు పీఎంఎంవై కింద ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డాక్టర్లు సందేష్, చెన్నకేశవ్ సోమవారం తెలిపారు. ప్రతి నెలా గర్భిణులకు పీహెచ్‌సీ వచ్చే వారికి తమ సిబ్బందితో తాము కూడా తమ సొంత ఖర్చులతో సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ షేక్‌జానీ సైదా, ఎం.దుర్గారావు, ల్యాబ్ టెక్నిషియన్, హెల్త్ అసిస్టెంట్స్ డి.సురేష్‌బాబు, జి.నాగేశ్వరరావు, వి.ప్రతాప్ పాల్గొన్నారు.